
www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 7 | 9-6-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## నీట్ రీ-ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- పేపర్ తయారీ నుంచి పంపిణీ వరకు ప్రత్యేక నిఘా
- వాయుసేన సహాయంతో ప్రశ్నపత్రాల రవాణా
- జూన్ 21 వరకు రహస్య ప్రదేశంలో నిపుణులు

4

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

4






## హోర్ముజ్ జలసంధి మూసివేత

- సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్

వివరాలు 4వ పేజీలో




## రాబోయే 24 నెలలు అభివృద్ధికే!

దేశ ఆర్థిక వ్యవస్థకు ఆరు నగరాలే వెన్నెముక

ఇతర నగరాల సమస్యలు ఇక్కడ రాకుండా ప్రణాళికలు

- సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లుగా విభజన
- గాజులరామారంలో వంద ఎకరాల్లో బస్ టెర్మినల్
- పేదల కోసం లక్ష ఇండ్ల నిర్మాణం..
- నిధులు తేని బీజేపీ ఎంపీలను నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మియాపూర్ 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సభలో వెల్లడి



దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలతో హైద రాబాద్‌ను విశ్వనగరంగా తీర్చి దిద్దేందుకు చర్యలు చేపడుతు న్నట్లు ప్రకటించారు. సోమ వారం మియాపూర్‌లో నిర్వ హించిన ప్రజా పాలన బహిరం గ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్

వివరాలు 2వ పేజీలో

## బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

### దిగుమతులకు బ్రేక్!

- 80 రోజులకు సరిపడా నిల్వలు
- సంస్కరణలతో లక్షల మందికి ఉపాధి
- అర్జెంటీనాలో ఆరు 'క్రిటికల్ మినరల్స్' బ్లాకుల కొనుగోలు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2



దేశంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని, దిగుమతులను క్రమంగా తగ్గిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. బొగ్గు రంగంలో తెచ్చిన సంస్కరణలతో ఐదు లక్షల మందికి ఉపాధి లభించిందని, భవిష్యత్తు అవసరాల కోసం 'క్రిటికల్ మినరల్స్'పై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన స్పష్టం చేశారు.



## బడులను మూసే కుట్ర!

- 27 వేల పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తారా?
- ముఖ్యమంత్రి తీరుపై మండిపడ్డ కవిత

3

## పకడ్బందీగా ఓటర్ల జాబితా

- ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ
- సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్
- స్పష్టం చేసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి

3




## ఎబోలాపై అప్రమత్తం!



- శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ఠ నిఘా
- గాంధీ ఆసుపత్రిలో ఇద్దరికి నెగిటివ్
- తప్పుడు అడ్రస్ ఇస్తే క్రిమినల్ కేసులు
- మంత్రి దామోదర్ రాజనర్సింహా

2



## హౌసింగ్ బోర్డులో భారీ భూదందా

- డిప్యూటీ కలెక్టర్‌ను సస్పెండ్ చేసిన సర్కారు
- అక్రమాలకు పాల్పడితే వదిలిపెట్టమన్న పొంగులేటి

2

## కొడుకు, కూతురికి మరణశిక్ష

### భార్యకు జీవిత ఖైదు

- పింఛన్ డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగిని ముక్కలుగా నరికిన కుటుంబ సభ్యులు
- మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు

2



## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనార్
- పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు

2

## మహిళా శక్తి ప్రదర్శన!

- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సదస్సు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఆర్టీసీకి మహిళా సంఘాల 553 బస్సుల అప్పగింత

3





# కొడుకు, కూతురికి ఉరి

**భార్యకు జీవిత ఖైదు.. మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు**

**పింఛన్ డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగిని ముక్కలుగా నరికిన కుటుంబ సభ్యులు**

**హైదరాబాద్, జూన్ 8 :** పింఛను డబ్బుల కోసం కట్టుకున్న భర్త, కన్న తండ్రి అని కూడా చూడకుండా ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగిని అత్యంత కిరాతకంగా నరికి చంపిన కేసులో మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ దారుణానికి పాల్పడిన మృతుడి భార్యకు జీవిత ఖైదు, కొడుకు, కూతురికి మరణశిక్ష (ఉరి) విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నగరంలో 2019 ఆగస్టులో జరిగిన కిషన్ సుతార్ (70) హత్య కేసు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. విశ్రాంత రైల్వే ఉద్యోగి అయిన కిషన్ సుతార్‌కు వచ్చే పింఛను డబ్బుల కోసం సొంత కుటుంబ సభ్యులే రాక్షసులుగా మారారు. భార్య గంగాబాయి, తన కొడుకు, కూతురుతో కలిసి పథకం ప్రకారం కిషన్ సుతార్‌ను దారుణంగా హత్య చేశారు. కేవలం చంపడంతోనే వారి కర్కశత్వం ఆగలేదు. హత్య అనంతరం ఆధారాలు మాయం చేసేందుకు మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికారు. ఆ శరీర భాగాలను ఏకంగా ఆరు ప్లాస్టిక్ బకెట్లలో నిల్వ చేసి అత్యంత పాశవికంగా ప్రవర్తించారు. ఈ దారుణంపై సమాచారం అందుకున్న పోలీసులు.. అప్పట్లో ఘటనా స్థలానికి చేరుకుని భయానక దృశ్యాలను చూసి విస్తుపోయారు. పక్కా ఆధారాలతో నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. దర్యాప్తును వేగవంతం చేసి కోర్టులో బలమైన ఆధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. పోలీసులు సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల విచారణతో నేరం సుస్పష్టంగా రుజువైంది. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ రావు ఈ కేసులో తుది తీర్పును వెలువరించారు. కన్న తండ్రిని అత్యంత కిరాతకంగా ముక్కలుగా నరికిన కొడుకు, కూతురి అమానవీయ చర్యను అరుదైన కేసుగా పరిగణించిన కోర్టు.. వారిద్దరికీ ఉరిశిక్ష ఖరారు చేసింది. హత్యకు సహకరించిన మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు విధించింది. డబ్బు కోసం కుటుంబ సభ్యులే ఇంతటి దారుణానికి ఒడిగట్టడం, దానికి కోర్టు కఠిన శిక్షలు విధించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

**ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్**

**పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు**

**హైదరాబాద్, జూన్ 8:** చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ÷ర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# రాబోయే 24 నెలలు అభివృద్ధికే!

- దేశ ఆర్థిక వ్యవస్థకు ఆరు నగరాలే వెన్నెముక
- సమస్యలు ఇక్కడ రాకుండా ప్రణాళికలు
- సమన్వయం కోసమే 3 కార్పొరేషన్లు
- గాజులరామారంలో బస్ టెర్మినల్
- పేదల కోసం లక్ష ఇండ్ల నిర్మాణం..
- నిధులు తేని బీజేపీ ఎంపీలను నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మియాపూర్ ప్రజా పాలన సభలో వెల్లడి



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కలకత్తా, చెన్నై, హైదరాబాద్ నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో ముంపు, బెంగళూరు, చెన్నై, కలకత్తాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మహానగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాల కోసమే నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామన్నారు. మున్సిపల్, పోలీసు శాఖల మధ్య సమన్వయం మెరుగుపడేలా పరిపాలనా సరిహద్దులను నిర్ణయించామని వివరించారు. జెండాలు, ఎజెండాలకు అతీతంగా నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. నగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని, ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకే సమీపంలో వీటిని నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విడిపించి పేదల గృహ నిర్మాణానికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు 150 వాణిజ్య స్టాల్స్ కేటాయించామని, వారిని పెట్రోల్ బంకుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. హైదరాబాద్‌కు తగిన మౌలిక వసతులు కల్పించే క్రమంలో మెట్రో రెండో దశ పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గాజులరామారంలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. కేవలం మూడు నెలల్లోనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు ఎందుకు చొరవ చూపడం లేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధుల సాధనలో ముందుండాలని సూచించారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధిని ప్రశంసించే వాళ్లు.. తెలంగాణలో మూసీ నది అభివృద్ధిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలోని పన్నెండేళ్ల బీజేపీ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ముప్పై నెలల పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎవరు రాష్ట్రానికి ఎంత అభివృద్ధి చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో ప్రజల ముందే తేల్చుకుందామన్నారు. రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకే అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

- దిగుమతులకు బ్రేక్!
- 80 రోజులకు సరిపడా 189 మిలియన్ టన్నుల నిల్వలు
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదు లక్షల మందికి ఉపాధి
- అర్జెంటీనాలో ఆరు 'క్రిటికల్ మినరల్స్' బ్లాకుల కొనుగోలు
- వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, జూన్ 8:** కేంద్ర ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తిలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడంతో దేశం స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను క్రమంగా తగ్గిస్తున్నామన్నారు. నూతన భారత నిర్మాణంలో కోల్, మైనింగ్ రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 80 రోజులకు సరిపడా 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందన్న ఆయన.. బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని దేశం చేరుకుందని వివరించారు. కాంగ్రెస్ హయాంలో లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాలు జరగ్గా.. తమ ప్రభుత్వం పారదర్శక విధానాలతో ఈ రంగంలో ఏకంగా ఐదు లక్షల మందికి ఉపాధి కల్పించిందన్నారు. అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ పై అధ్యయనం చేస్తున్నామని, వాడకం పూర్తయిన గనులను శాస్త్రీయంగా మూసివేస్తూ.. ఆ విధానంలో గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

**క్రిటికల్ మినరల్స్ పై గురి..**

క్రిటికల్ మినరల్స్ కోసం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, దేశాధినేతలను కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్‌కు ఓ పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందన్నారు. ఈ నేపథ్యంలో 'క్రిటికల్ మినరల్స్ మిషన్' కింద రూ. 1,500 కోట్లు కేటాయించామని, ఇప్పటికే అర్జెంటీనాలో ఆరు బ్లాకులను తీసుకున్నామని వివరించారు. మరోవైపు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, బాధిత జిల్లాలకు ఆ నిధులను ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఇక సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర సర్కారు ఆధీనంలోనే ఉంటాయని, కార్మికులకు మెరుగైన ఆర్థిక భద్రత కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తేల్చి చెప్పారు.

# ఎబోలాపై సర్కారు అప్రమత్తం!

- శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా
- గాంధీ ఆసుపత్రిలో ఇద్దరికి నెగిటివ్
- తప్పుడు అడ్రస్ ఇస్తే క్రిమినల్ కేసులు
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, జూన్ 8:** ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా పెట్టింది. తప్పుడు వివరాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రయాణికులతో మాట్లాడేందుకు ప్రత్యేకంగా అనువాదకులను నియమిస్తున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల వివరాలు సేకరించి, వారి ఆరోగ్యాన్ని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. అనుమానితులను వెంటనే గుర్తించి గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితుల శాంపిల్స్ ను పుణెలోని ఎన్ఐవీకి పంపగా నెగిటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు. ఐసీఎంఆర్ సూచనలతో రెండోసారి కూడా శాంపిల్స్ పంపామని, మళ్లీ నెగిటివ్ వస్తే డిశ్చార్జి చేస్తామన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం వద్దని మంత్రి సూచించారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా కిట్లు వచ్చాయని, శాంపిల్ రాగానే పరీక్షలు చేసి నివేదిక ఇస్తామని సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. రాష్ట్రంలో ఎబోలా నివారణకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. విదేశాల నుంచి వచ్చే కొందరు ప్రయాణికులు తప్పుడు అడ్రస్ ఇస్తున్నారని అధికారులు తెలపడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు దాచిపెడితే ఎపిడెమిక్ డిసీజెస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని ఎయిర్ పోర్టులోనే ప్రయాణికులకు స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రయాణికులతో మాట్లాడేందుకు ఈఎఫ్ఎల్యూ సహకారం తీసుకోవాలని, ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు మాట్లాడే సిబ్బందిని ఎయిర్ పోర్టులో మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం ఆరోగ్య శాఖ, జీహెచ్ఎంసీ, పోలీసుల మధ్య సమన్వయం పెరగాలన్నారు. ఈ సమీక్షలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, డీసీపీ శిల్పవల్లి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతలో రాజీ లేదు!

**ఫుడ్ పాయిజన్‌కు ఏమాత్రం తావుండొద్దు**

**ప్రవేశాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి**

**స్పష్టం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్, జూన్ 8:** గురుకులాల్లో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం విషయంలో ఎలాంటి రాజీ పడబోమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనలకు ఏమాత్రం తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి సోమవారం గురుకుల విద్యాలయాల సంస్థ సిబ్బంది, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాలు దళిత, గిరిజన, పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలన్నారు. వంట సరుకుల కొనుగోలు నుంచి నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ నాణ్యత పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని సిబ్బంది తమ సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి సూచించారు. జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో పైకప్పుల లీకేజీలు, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, గురుకులాల సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద, అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, చిన్న సైలు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి ముందు బంధం తప్పుకాదు!

**ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకుంటే నేరం కాదు**

**క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న సుప్రీంకోర్టు**

**ప్రతి ప్రేమకథా పెళ్లితో ముగియాలన్న రూల్ లేదు**

**కానిస్టేబుల్ అభ్యర్థి ఉద్యోగం రద్దు చెల్లదు**

**తెలంగాణ యువకుడికి అనుకూలంగా తీర్పు**

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన, క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ప్రేమ విఫలమైనంత మాత్రాన మోసం చేసినట్లు కాదని స్పష్టం చేస్తూ.. పాత కేసు కారణంగా కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన తెలంగాణ యువకుడికి పెద్ద ఊరటనిచ్చింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీ పడ్డాయి. అయితే ఈ కేసును సాకుగా చూపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పోలీసు బోర్డు నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉండి ఆ తర్వాత పెళ్లి చేసుకోలేదన్న ఒకే ఒక్క కారణంతో మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని పేర్కొంది. లోక్ అదాలత్‌లో రాజీపడినంత మాత్రాన సదరు అభ్యర్థి తప్పు ఒప్పుకున్నట్లు కాదని న్యాయమూర్తులు తేల్చిచెప్పారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకున్నప్పుడు.. అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేసే హక్కు పోలీసు



బోర్డుకు లేదన్నారు. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం అన్యాయమని పేర్కొన్నారు. పోలీసు బోర్డు రద్దు ఉత్తర్వులను కొట్టివేస్తూ.. తిరుపతిని వెంటనే విధుల్లోకి తీసుకుని తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

# హౌజింగ్ బోర్డులో భారీ భూదందా



- డిప్యూటీ కలెక్టర్ రామునాయక్‌ను సస్పెండ్ చేసిన సర్కారు
- సహకరించిన సూపరింటెండెంట్ శాశ్వత తొలగింపు
- అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 8 :** రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న రాము నాయక్‌పై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. హౌజింగ్ బోర్డు స్థలాల వ్యవహారంలో భారీగా భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో గజం రెండు లక్షల రూపాయలకు పైగా విలువ చేసే హైకోర్టు పరిసరాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన 33.53 గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా వేరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు తేల్చారు. పేదల ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలనలో ఈ దందాలు వెలుగుచూశాయి. తాజా విచారణలో విజయనగర్ కాలనీ, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్ గంజ్ తదితర ప్రాంతాల్లోనూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు బయటపడింది. ఇందులో సబ్ రిజిస్ట్రార్ల పాత్రపైనా విచారణ సాగుతోంది. ఈ అక్రమ సేల్ డీడ్లను వెంటనే రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**సహకరించిన వారిపైనా చర్యలు..**

రామునాయక్ భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ శాశ్వతంగా తొలగించింది. మరో సూపరింటెండెంట్ బోనానాయక్ ను సస్పెండ్ చేసింది. రామునాయక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టడంతో.. తీగ లాగితే డొంక కదిలినట్లు అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

# నిబంధనలు మీరితే సీజ్!

**బడుల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి**

**తనిఖీల కోసం 12 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు: మంత్రి పొన్నం**

**హైదరాబాద్:** రవాణా శాఖలో నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పన్నులు చెల్లించని, ఫిట్ నెస్ లేని, ఓవర్ లోడింగ్ తో తిరిగే వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో సోమవారం మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్ పోస్టులు రద్దు చేసిన నేపథ్యంలో ఎన్ ఫోర్స్ మెంట్ ను మరింత బలోపేతం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10, రాష్ట్ర స్థాయిలో 2 ప్రత్యేక స్క్వాడ్లతో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పన్నులు చెల్లించకుండా రాష్ట్రంలో తిరిగితే భారీ జరిమానాలు విధించడంతో పాటు సీజ్ చేయాలన్నారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, మినీ వ్యాన్లకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని, ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా వ్యవస్థలో క్రమశిక్షణ, ప్రజల ప్రాణ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్, డీటీసీలు రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి**

సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఇతర నేతలు కలిశారు. బీసీల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో బీసీ గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. పెండింగ్ ఫీజుల బకాయిలు చెల్లించాలని, బీసీ రిజర్వేషన్ల రోస్టర్ విధానం సవరించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా నిధి సంఖ్య పెంచడంతో పాటు బీసీ సంక్షేమ శాఖలో బీసీ ఉద్యోగులే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి పృథ్వీ గౌడ్, నేతలు బలరాం, సాయి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ యాప్ భేష్!

**దేశవ్యాప్తంగా తెలంగాణ నమూనాపై ప్రశంసలు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, జూన్ 8 :** రైతులకు పారదర్శకంగా ఎరువులు పంపిణీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. పొరుగు రాష్ట్రాలు కూడా ఈ నమూనాను ఆదర్శంగా తీసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎరువుల పంపిణీలో సాంకేతిక వినియోగాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఫెర్టిలైజర్ యాప్ పనితీరును కేంద్ర వ్యవసాయ శాఖ కూడా అభినందించిందని మంత్రి తుమ్మల తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. ఎరువుల కోసం రైతులు క్యూ లైన్లలో నిలబడే తిప్పలు తప్పించేందుకు యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇకపై మీసేవ కేంద్రాల ద్వారా, టెలిఫోన్ ద్వారా కూడా ఎరువులు బుకింగ్ చేసుకునే సదుపాయం తెస్తున్నామన్నారు. రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను మొబైల్‌లోనే తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

**నోడల్ అధికారుల నియామకం..**

రాష్ట్రంలో ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకునేందుకు ఢిల్లీలో ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించామన్నారు. కాకినాడ పోర్టు నుంచి యూరియాను వేగంగా తరలించేందుకు మరో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది.



# మూడు రోజుల్లో రుతుపవనాలు!

**ఆశాజనకంగా నైరుతి విస్తరణ.. పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు**

**నాలుగు రోజులు భారీ వర్షాలు..హైదరాబాద్ కు ఎల్లో అలర్ట్**

**వెల్లడించిన వాతావరణ కేంద్రం**



**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో ప్రవేశించనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం ఇవి ఆశాజనకంగా ముందుకు విస్తరిస్తుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. వచ్చే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసే వీలుంది. ఈ నెల 10వ తేదీ వరకు నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. గడిచిన 24 గంటల్లో వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. వనపర్తి జిల్లా ఏదుల మండలంలో అత్యధికంగా 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరులో 4.73 సెంటీమీటర్లు, చాదన్‌పూర్‌లో 3.58, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలో 4.06, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.44 సెంటీమీటర్ల వర్షం పడింది. వనపర్తి జిల్లా రేవల్లిలో 3.38, పంగల్‌లో 2.72, జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్‌లో 2.56, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.48 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయ్యింది.

# మహిళా శక్తి ప్రదర్శన!

**నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సదస్సు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి**

**ఆర్టీసీకి మహిళా సంఘాల 553 బస్సుల అప్పగింత**



**హైదరాబాద్, జూన్ 8:** రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా నేడు (మంగళవారం) సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 'మహిళా శక్తి మహాసభ' జరగనుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు ఈ సభకు హాజరవుతారని అంచనా. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సభలో వివరించనున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు అందుతున్న రూ. 5 లక్షల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతూ ఈ వేదికపైనే కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ. 500 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అలాగే, మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు.

**కొత్త బస్సుల కోసం ఆర్టీసీకి నిధులు..**

కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ. 199 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. అలాగే, మహిళా సంఘాలు అద్దెకు ఇచ్చిన బస్సుల అద్దె కింద ఆర్టీసీకి రూ. 20.30 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ. 10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను కూడా సభలో వివరిస్తారు. సభ ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. మహిళలంతా తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా ఉన్నతాధికారులతో సమీక్షించి ఏర్పాట్లను పరిశీలించారు.

# బడులను మూసే కుట్ర!

**27 వేల పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తారా?**

**ముఖ్యమంత్రి తీరుపై మండిపడ్డ కవిత**



**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్రంలో సమీకృత పాఠశాలల పేరుతో 27 వేల ప్రభుత్వ బడులను నాలుగు వేలకు కుదించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఇది పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసే దారుణమైన కుట్ర అని ఆమె విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను కుదించాలన్న నిర్ణయాన్ని తప్పుబడుతూ కవిత సోమవారం ఒక వీడియో విడుదల చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో వంద మందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా ముఖ్యమంత్రి కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏకంగా పాఠశాలలను మూసివేస్తున్నట్లు ప్రకటించడాన్ని చూస్తే విద్యాశాఖపై ప్రభుత్వానికి ఏమాత్రం పట్టులేదని స్పష్టమవుతోందని విమర్శించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీకృత పాఠశాలలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ బడుల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా.. 12 వేల ప్రైవేట్ బడుల్లో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన ఆ సభలో వెల్లడించారు.


# పకడ్బందీగా ఓటర్ల జాబితా

**ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ**

**సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్**

**స్పష్టం చేసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 8:** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగానే పెట్రోలింగ్ నిర్వహించి.. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి తగిన భద్రత, సహకారం అందించాలని పోలీసులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు బీఎల్వోలు, సూపర్ వైజర్లకు భద్రత కల్పించే అంశంపై మంగళవారం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సీఈఓ వసంత్ వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేసి, తిరిగి స్వీకరించాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బంది పేర్లు, ఫోన్ నంబర్లను స్థానిక పోలీసులకు ఇవ్వాలని, అలాగే పోలీసు అధికారుల నంబర్లను ఎన్నికల అధికారులు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుగానే పోలీసులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈవోలకు సూచించారు. సిబ్బందికి అవసరమైన భద్రత, పూర్తి సహకారం అందిస్తామని తఫ్సీర్ ఇక్బాల్ హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
మంగళవారం
9 జూన్ 2026



## తెలుగు రాష్ట్రాల్లో చాపకింద నీరులా

# డ్రగ్స్ సరఫరా

**ఆందోళనలో తల్లిదండ్రులు**

**విద్యార్థులే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠాల వ్యాపారం**

**గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో మగ్గుతున్న ఏపీ ప్రవాసులు..**

**దర్యాప్తునకు సహకరించని కుటుంబాలు**

**సీసీ కెమెరాల ఏర్పాటుతోనే యువతకు రక్షణ**

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరు-స్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో య-ువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# నీట్ రీ-ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- పేపర్ తయారీ నుంచి పంపిణీ వరకు ప్రత్యేక నిఘా
- వాయుసేన సహాయంతో ప్రశ్నపత్రాల రవాణా
- జూన్ 21 వరకు రహస్య ప్రదేశంలో నిపుణులు



AI generated image

**న్యూఢిల్లీ, జూన్ 8:** నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో జూన్ 21న నిర్వహించనున్న రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రత్యేక చర్యలు చేపట్టాయి. పేపర్ లీకేజీకి ఏమాత్రం అవకాశం లేకుండా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష పూర్తయ్యే వరకు రహస్య ప్రదేశంలో ఉంచినట్లు తెలుస్తోంది. వారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులో లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. గతంలో ప్రశ్నపత్రాల రవాణా సమయంలో లీకేజీకి అవకాశం లభించిన నేపథ్యంలో ఈసారి భారత వైమానిక దళం సహాయంతో ప్రశ్నపత్రాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించనున్నారు. ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా ప్రశ్నపత్రాలను సురక్షితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాల బాక్సులకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేయడంతో పాటు, ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ ప్రతి దశలో ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలించనున్నారు. సోషల్ మీడియాలో నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తున్న ముఠాలపై నిఘా పెట్టేందుకు సైబర్ విభాగాన్ని కూడా రంగంలోకి దించారు. గత పరీక్ష రద్దు కావడంతో రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయబోమని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణకు అయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది.

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎమ్‌ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

## టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

**రాజ్యసభ ఎంపి రాజీనామా**

**కోల్‌కతా, జూన్ 8:** టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ**

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

## హోర్ముజ్ జలసంధి మూసివేత

**సంక్షోభంకొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

**దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు**

**కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్**



న్యూఢిల్లీ, జూన్ 8: హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారమే మా ధ్యేయం





• మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో 2, 3, 4 , 16, 17 వార్డుల ప్రత్యేక సభలు మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల చుట్టుపక్కల ఎక్కడా చెత్తచెదారం వేయవద్దని, ముఖ్యంగా డ్రైనేజీలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పడేయడం వల్ల మురుగు నీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. వార్డులలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా స్థానిక కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని, మున్సిపల్ యంత్రాంగం ద్వారా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు బాలకృష్ణ, దూడల లక్ష్మి , మున్సిపల్ మేనేజర్ సర్వర్ , విద్యుత్ శాఖ ఏఈ కే లక్ష్మీ రాజం, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ వి ఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రత చర్యలు

జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన భద్రత ద్రాచల చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వి ఎం గోదాము వద్ద 24 గంటల పాటు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, సి సి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, నాయబ్ తహసిల్దార్ శ్యామ్ లాల్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత, నాణ్యమైన విద్యా-వైద్య సేవలు అందించాలి

• సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు భూపాల్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యత రగతి ప్రజలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారుతున్నాయని, ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేసి అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల్లో అవసరమైన సౌకర్యాలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొంది. ఫలితంగా పేద ప్రజలు ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తూ అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ , వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. విద్య, వైద్యం హక్కులుగా అమలు చేయాలని, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చే విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేసింది.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పేదలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్ , జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్, గోడిసెల కార్తీక్, నాయకులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

• సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు టిడబ్ల్యూజేఎఫ్ వినతి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ అహర్నిశలు సేవలందిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న అన్నారు. సోమవారం కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ వేతనాలు లేకుండా పనిచేస్తూ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులు సమాజానికి నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, తమ పిల్లల విద్య కోసం కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న భారీ ఫీజులను భరించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మానవీయ కోణంలో పరిశీలించి, 2026–27 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఈర్ల సునీల్ కుమార్, ఎండి నౌషాద్, కడారి శ్రీనివాస్, రాజనర్సయ్య, సీహెచ్ తరుణ్, అన్నబోయిన రాజు, వేల్పుల ప్రదీప్, జి.వెంకటేష్, రమేష్ సోనాలె, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల దరఖాస్తుల గడువు పొడిగింపు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లాలో ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ మేరకు 2026–27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన ఒక ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం మరో రెండు రోజులు పొడిగించి జూన్ 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జూన్ 12న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇన్స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని, ఆయా పోస్టుకు కనీసం ఏడో తరగతి పాసై ఉండాలని సూచించారు. అర్హులైన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గడువులోగా అందజేయాలని కోరారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాల వయోసడలింపు వర్తిస్తుందని తెలిపారు. స్థానికత, మెరిట్ ఆధారంగా పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# గ్రామ అభివృద్ధి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతీలో సోమవారం 99 రోజుల ప్రణాళిక గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ పంద్రం సుగుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గ్రామసభలో నూతన పెన్షన్ల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉపాధిహామీ పథకం పనులు, వ్యవసాయ రంగ సమస్యలు, విద్యుత్ సరఫరా, వైద్య ఆరోగ్య సేవలు, ఇందిరా క్రాంతి పథకం అమలు, రెవెన్యూ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం మోహన్, ఏఈఓ రామ్, సీసీ భాస్కర్, డాక్టర్ ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నానులాల్, ఇన్చార్జి సెక్రటరీ బాపూరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ అంగన్వాడీ టీచర్ దంపతులకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మాదారం గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో రిటైర్డ్ అంగన్వాడీ టీచర్ కల్వకొనల అనసూర్య దంపతులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్గా అనసూర్య అందించిన సేవలు గ్రామ అభివృద్ధికి, చిన్నారుల సంక్షేమానికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఆమె పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, డీఈ మల్లయ్య, ఏఈ మనోహర్, మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, మీసా లలిత, ఉట్లంచర్ల సౌమ్య, డీలర్ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్, సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** రైతులకు యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని మంచిర్యాల డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాండూర్ మండలానికి ప్రభుత్వం ఐదు మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆన్లైన్ విధానం ద్వారా యూరియా విక్రయాలు చేపడుతోందని తెలిపారు. అయితే ఆన్లైన్లో బుకింగ్ చేసుకున్న రైతులను కొంత మంది డీలర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. ఆన్లైన్లో నమోదు చేసుకున్న రైతులకు యూరియాను పారదర్శకంగా, సకాలంలో అందించాలని అధికారులను కోరారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించబోమని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కటకల మల్లేష్ యాదవ్, చీకటి వెంకటేష్ గౌడ్, అంజిబాబు, కొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 10న తోషంలో గ్రామసభ

• హాజరుకానున్న రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇంతియాజ్ తెలిపారు. స్థానిక ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పోలీసు శాఖ డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తదితర అధికారులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ రహదారి భద్రత, ప్రమాదాల నివారణ, 'అరైవ్–అలైవ్' కార్యక్రమం ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారని, ట్రాఫిక్ నిబంధనలు, ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తోషం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ప్రజావాణి దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్ట ర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన అంబిలపు కౌశిక్ కళ్యాణ్ తనకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ – టి మండలం కొమ్ముగూడ గ్రామానికి చెందిన దుర్గం హోక్టు తమకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు ఇస్తే కబ్జా చేసుకున్నాడని, తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ కు చెందిన కవిత మండల్ తన భర్త ఎల్ ఐ సి లో భీమా ప్రీమియం తీసుకొని మరణించారని, భీమా డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి చెందిన దేశబోయిన నవీన్ తనకు వస్తున్న ఆసరా పింఛను డబ్బులు బ్యాంకు ద్వారా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన పెరుగు కమలాబాయి తనకు చెందిన భూమిలో అక్రమంగా ఇండ్లు నిర్మిస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామానికి చెందిన గందే శంకరయ్య గతంలో వచ్చిన ఆసరా పింఛన్ 2 నెలల నుండి రావడం లేదని, పింఛన్ పున: రుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డొంగ్రి సంధ్య తన మానశికి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామానికి చెందిన మల్లేష్ తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్తు రాజ కుల ఆధ్యాత్మిక మహోత్సవం



**ఉద్యమ కెరటం, వరంగల్:** తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో ముత్తురాజ కుల కమ్యూనిటీ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ తిరుమంగై ఆళ్వార్ మన్నన్ వంశస్థులైన ముత్తురాజ కుల సభ్యులు నిర్వహించిన ఆధ్యాత్మిక ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. తిరుక్కచ్చి నంబి వీధిలోని శ్రీ తిరుమంగై ఆళ్వార్ మండపంలో జరిగిన ఈ మహోత్సవానికి తెలంగాణకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ముదిరాజ్ చరిత్ర పరిశోధకుడు సోనబోయిన సతీష్ ముదిరాజ్ ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తురాజ కుల ఐక్యత, వారి ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింభించే గొప్ప కార్యక్రమంగా ఈ ఉత్సవం నిలిచిందన్నారు. కంచి శ్రీ వరదరాజ పెరుమాళ్ స్వామి బంగారు గుర్రం వాహనంపై ఊరేగింపుగా మండపానికి వచ్చి భక్తులకు దర్శనమివ్వగా, భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్ ముదిరాజ్ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన కాంచీపురంలోని పలు పురాతన దేవాలయాలను సందర్శించి అక్కడి తెలుగు శాసనాలను పరిశీలించారు. అలాగే ముత్తురాజ, ముత్తిరియార్ కులాల సంస్కృతి, సాంప్రదాయాలు, వృత్తి జీవన విధానాలపై స్థానికులతో చర్చించి విలువైన సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా తమిళనాడు ముదిరాజ్ రచయిత కె.ఎం.ఎ. సుబ్రహ్మణ్యం తమిళనాడులోని ముత్తురాజ కులాల ఆర్థిక స్థితిగతులు, జనాభా, ఆచార వ్యవహారాలకు సంబంధించిన పలు పత్రాలు, గ్రంథాలను సతీష్ ముదిరాజ్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎ. సత్యనారాయణ, చైర్మన్ పి.నందగోపాల్ నాయుడు, కార్యదర్శి బి.కే. పద్మనాభన్, కోశాధికారి వి.వేణుగోపాల్ నాయుడు, సంయుక్త కార్యదర్శి ఎం.మణి నాయుడు, న్యాయవాది జి.ఇలంగోవన్, పి.చిన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ




**ఉద్యమ కెరటం, ములుగు:** పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ సాధ్యమని ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లిలో వార్డు సభ నిర్వహించారు. 10వ వార్డు కౌన్సిలర్ గజ్జల సుస్మిత, 11వ వార్డు కౌన్సిలర్ కే శెట్టి నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిశుభ్రత లోపిస్తే సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బండారుపల్లి గ్రామ అభివృద్ధికి మంత్రి సీతక్క సహకారంతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త పింఛన్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్లు సుస్మిత, నవీన్ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో మంత్రి సీతక్క సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనగాం సంపత్, టౌన్ ప్లానింగ్ అధికారి, ములుగు ఎస్సై చంద్రశేఖర్, కౌన్సిలర్లు సిలువేరు సాంబయ్య, నల్లెల్ల స్వాతి భరత్, గుగ్గిళ్ల దివ్య సుజన్, ఎండీ కుతుబుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, నాయకులు యాసం రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నెల్లుట్ల రాజన్న, సీనియర్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో పోడు భూముల వివాదం

• అటవీ శాఖ, గిరిజనుల మధ్య వాగ్వాదం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలో పోడు భూముల వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. మండలంలోని కాకరపల్లి బీట్ పరిధిలో తామరచెరువు సమీపంలోని కంపార్ట్మెంట్ నం.157లో అటవీ శాఖ అధికారులు, గిరిజనుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. అటవీ శాఖ అధికారులు సుమారు 10.5 హెక్టా ర్ల భూమి ప్రభుత్వ అటవీ భూమి అని పేర్కొంటుండగా, గిరిజనులు మాత్రం ఆ భూమిని తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని వాదిస్తున్నారు. అటవీ భూముల్లోకి ప్రవేశించకుండా అధికారులు ట్రెంచ్లు తవ్వగా, గిరిజనులు వాటిని పూడ్చివేసి పోడు సాగు పనులు చేపట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అటవీ శాఖ సిబ్బంది అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోడు సాగు చేస్తున్న ఇద్దరు గిరిజనులను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వారిని తీసుకెళ్తున్న అధికారుల వాహనాన్ని గిరిజన మహిళలు అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. గిరిజనులు, అటవీ శాఖ సిబ్బంది మధ్య తోపులాట జరగడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటన స్థలంలో ఉద్రిక్తత కొనసాగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోడు భూముల యాజమాన్యంపై ఇరువర్గాలు తమ వాదనలు వినిపిస్తుండగా, సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పోడు భూములపై న్యాయం చేయాలి

• డీఎఫ్ఓను కలిసిన పోడు రైతులు, బీఆర్ఎస్ నాయకులు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** పోడు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, పోడు రైతులు సోమవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్జలి, గంగాపూర్, దిందా గూడెం తదితర గ్రామాలకు చెందిన పోడు రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు. ఇటీవల రాష్ట్ర పీసీసీఎఫ్ను కలిసి పోడు రైతుల సమస్యలను వివరించిన నేపథ్యంలో జిల్లా స్థాయిలో డీఎఫ్ఓను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కుటుంబ జీవనాధారం కోసం ఎకరం, రెండు ఎకరాల భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆ భూములను ఖాళీ చేయాలని సూచించడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మానవతా దృక్పథంతో సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యలను సావధానంగా విన్న డీఎఫ్ఓ సానుకూలంగా స్పందిస్తూ, పోడు రైతుల పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు సమన్యాయం జరిగేలా కృషి చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేశం, యువజన నాయకులు కాశీపాక రాజు, చింతలమానేపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోమాసే లాంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని 17వ వార్డులో సోమవారం నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి – వార్డు సభ" కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్, మున్సిపల్ ఛైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుకు చెందిన ప్రజల సమస్యలను అధికారులు స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ నిర్వహించారు. వార్డులోని తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పలు దరఖాస్తులను స్వీకరించిన అధికారులు వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొ ని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకోవడం ద్వారా మెరుగైన పాలన అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

# ట్రావెల్స్ బస్సు ప్రమాదం. 26 మందికి గాయాలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆంధ్ర ప్రదేశ్లోని ధర్మాజీగూడెం నుంచి హైదరాబాద్కు సత్తుపల్లి మీదుగా ప్రయాణికులను తీసుకెళ్తున్న కేవీఆర్ ట్రావెల్స్ బస్సు సోమవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదానికి గురైంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని కొత్తలంకపల్లి గ్రామ సమీపంలో బస్సు అదుపుతప్పి రైల్వే బ్రిడ్జిని ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 33 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రయాణికులు గాయపడగా, వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వీఎం బంజర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ల ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్ట ం జరగకపోవడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సు అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి ప్రధాన కారణమై ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టా రు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, వేగంపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.129.25 కోట్ల వ్యయంతో ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## రాష్ట్ర మంత్రి సీతక్క



**ఉద్యమ కెరటం, ములుగు:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి. సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ములుగు జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి పాఠశాలల సిద్ధతపై సమగ్రంగా సమీక్షించారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి పాఠశాలలకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలు, తరగతి గదులు, హాస్టల్ గదులు, వంటశాలలు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి లోపాలుంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపర్చి తాగునీరు అందేలా చూడాలని, వర్షాకాలం నేపథ్యంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పాఠశాలల్లోని మరుగుదొడ్ల ను పరిశుభ్రంగా ఉంచి, బాలికలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వేసవి సెలవుల కారణంగా మూతపడి ఉన్న తరగతి గదులు, హాస్టళ్ల లో విషపురుగులు, పాములు, క్రిమికీటకాలు ఉండే అవకాశం ఉన్నందున ప్రత్యేక తనిఖీలు నిర్వహించి క్రిమిసంహారక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు, క్రమశిక్షణ, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆదివాసీ, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా బోధన, బోధనేతర సిబ్బంది పనిచేయాలని సూచించారు.

# బొంతు వేణును పరామర్శించిన ఎమ్మెల్యే



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత భర్త బొంతు వేణును సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన బొంతు వేణు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తమ కుటుంబాన్ని పరామర్శించి ఆత్మస్థైర్యం కల్పించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తడిసిన ధాన్యం వెంటనే తరలించాలి





- **కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**

**ఉద్యమ కెరటం, వేములవాడ:** కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు చేసిన ధాన్యం, తరలించిన నిల్వల వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్ తేమ యంత్రంతో ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్తో మాట్లాడి వెంటనే లారీలను సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోళ్ల ప్రక్రియలో జాప్యం లేకుండా ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోళ్లలో వేగం పెంచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. నిల్వలకు అనుగుణంగా వాహనాలను అందుబాటులో ఉంచాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ల కు సూచించారు. ముఖ్యంగా తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహశీల్దార్ అబూబాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సదల్పూర్లో తీరిన తాగునీటి కష్టాలు



**ఉద్యమ కెరటం, బేల:** మండలంలోని కొలాం ఆదివాసీ గ్రామం సదల్పూర్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేసింది. నిధులతో చేపట్టిన పైప్లైన్ పనులు పూర్తికాగా, సోమవారం గ్రామ సర్పంచ్ మార్సుకోల మంగేష్తో కలిసి సామ రూపేష్ రెడ్డి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేసిన సామ రూపేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెస్రం సంజయ్, బేల మండల యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, గ్రామస్తులు శ్యామ్రావు, విట్టల్, దేవరావు, జోగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ గాలికి

- **ప్రజలకు తప్పని ఇబ్బందులు**
- **నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం..!**
- **పే అండ్ యూస్ తరహాలో ఏర్పాటు చేయాలి**





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ ప్రస్తుతం సరైన నిర్వహణ లేక ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ప్రయాణికులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు ఉపయోగించే ఈ మరుగుదొడ్లు పరిశుభ్రత లోపంతో పాటు విద్యుత్, లైటింగ్ వంటి కనీస సౌకర్యాల కొరతతో వినియోగదారులకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధానమైన గాంధీ చౌక్ వద్ద ఉన్న ప బ్లిక్ టాయిలెట్స్కు తాళం వేసి ఉండడం, పరిశుభ్రత లేక దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు వాటిని వినియోగించేందుకు వెనుకాడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సరైన లైటింగ్ లేకపోవడం మహిళలు, వృద్ధులకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించినా సదుపాయాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి పరిశుభ్రత, నీటి సరఫరా, భద్రతా చర్యలను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ను క్రమం తప్పకుండా శుభ్రపర్చడం, తగిన సిబ్బందిని నియమించడం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైతే పట్టణ ప్రాంతాల్లో ఉన్న పే అండ్ యూస్ తరహాలో ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జంగం గ్రామపంచాయతీ నూతన కార్యదర్శికి ఘన స్వాగతం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జైనూర్ మండలం జంగం గ్రామపంచాయతీకి నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శికి గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, వార్డు సభ్యులు నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, వీధిదీపాల నిర్వహణ, ఉపాధిహామీ పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. నూతన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తూ గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నూతన కార్యదర్శికి అభినందనలు తెలియజేస్తూ, ఆయన సేవలు గ్రామ ప్రగతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టీయూ) ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్కు వినతిపత్రం సమర్పించారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారన్న ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా నేతృత్వంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీడీఓ సానుకూలంగా స్పందిస్తూ, ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, రూ.12వేల ఆర్థిక సహాయం, రూ.5లక్షల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి పట్టణ, మండల కేంద్రంలో ఆటో భవనాల నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని, సింగరేణి, ఆర్టీసీ కార్మికులకు అందిస్తున్న బీమా సదుపాయాలను ఆటో కార్మికులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి సేవలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని, డీజిల్, సీఎన్జీ ధరలను తగ్గించాలని, ఆటో డ్రైవర్లకు సబ్సిడీ అందించాలని కోరారు. ఆటో కార్మికుల జీవన పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్, బండి చందు, రఫీ ఖాన్, పుప్పాల శ్రీకాంత్, పోచం, కుమార్, దుర్గయ్య, షన్ను, రంగయ్య, గురుమూర్తి, రాజన్న, అజార్, నవీన్, వినోద్, సంతోష్, భీమేష్, తిరుపతి, విజయ్, సత్తి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, డివిజన్, వార్డు సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్ల కు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్లో నిర్వహించిన డివిజన్ సభకు డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్ సంపత్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్–అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త, వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల వివరాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు కానుందని తెలిపారు. డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, బాలికల రక్షణ కోసం షీటీం సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం అందిస్తే డి–అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ అందజేస్తామని అన్నారు. మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ మంచిర్యాల శుభ్రత ప్రతిఒక్కరి ఆరోగ్య భద్రత లక్ష్యంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు, మురుగు కాలువల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

## దివ్యాంగులకు ట్రైసైకిల్, వీల్చైర్ అందజేత



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** దివ్యాంగుల సమస్యలపై వెంటనే స్పందించి వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తూ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం ఐడీఓసీకి వచ్చిన ఇద్దరు దివ్యాంగుల ఇబ్బందులను తెలుసుకుని తక్షణమే పరిష్కారం చూపించారు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చింతకింది లస్మయ్య, ఎల్లా రెడ్డిపేట మండలం గొల్ల పల్లికి చెందిన ముద్రకోల దీన తమ సమస్యలతో కలెక్టర్ను కలిసేందుకు వచ్చారు. వారితో మాట్లాడిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారి పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు. చింతకింది లస్మయ్యకు మాన్యువల్ ట్రైసైకిల్, ముద్రకోల దీనకు వీల్చెర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి కలెక్టర్ స్వయంగా ట్రైసైకిల్, వీల్చైర్ను అందజేశారు. తమ సమస్యలను అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్ చొరవతో తమకు ఎంతో ఉపశమనం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

# బడిబాటలో విద్యార్థుల నమోదు పెంపొందించాలి





## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు లలితతో కలిసి పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో తరగతి గదులు, పాఠశాల ఆవరణలు, వంట గదులు, వంట పాత్రలను పూర్తి స్థాయిలో శుభ్రపర్చాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బియ్యం, ఇతర సామగ్రి ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు చేరుకున్నాయని, వాటిని వెంటనే పాఠశాలలకు పంపిణీ చేయాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కనీసం 10శాతం ఎక్కువ అడ్మిషన్లు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. 5, 7, 8వ తరగతులు పూర్తి చేసిన ప్రతి విద్యార్థిని తదుపరి స్థాయి పాఠశాలల్లో తప్పనిసరిగా చేర్పించాలని, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టాలని తెలిపారు. విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా చర్యలు తీసుకుని డ్రాప్అవుట్లను పూర్తిగా నివారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ సర్టిఫికెట్లు జారీ చేసే సమయంలో విద్యార్థి చేరిన కొత్త పాఠశాల వివరాలను నమోదు చేసి సంబంధిత మండల విద్యాధికారికి అందజేయాలని సూచించారు. భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జూన్ 15న పాఠశాలలు ప్రారంభం కాకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని, వాటిపై మండల విద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జె.సత్తయ్య, కె.కృష్ణమూర్తి, కె.విజయలక్ష్మి , ఎ.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన ప్రజా సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జన్నారం మండలానికి చెందిన రాజు గౌడ్ ఉపాధి కల్పించాలని, చెన్నూర్కు చెందిన సైదల పద్మ ప్రజాపాలన వివరాలను గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీకి మార్చాలని కోరారు. బెల్లంపల్లి మండలం బట్వాన్పల్లి గ్రామానికి చెందిన కదారి బీరయ్య తన వ్యవసాయ భూమిలోకి మురుగునీరు చేరుతోందని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మంచిర్యాల పట్టణానికి చెందిన జె.శాంతయ్య కుటుంబ సమస్యలపై న్యాయం చేయాలని, భూపాలపల్లి జిల్లా కు చెందిన బుర్ర లచ్చయ్య భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. భీమారం మండలం కొత్తపల్లికి చెందిన అంగడి రాములు దివ్యాంగ పింఛన్ పునరుద్ధరించాలని వినతి చేశారు. హమాలివాడ ప్రాంతవాసులు తమ నివాస ప్రాంత సమీపంలో ఏర్పాటు చేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్ను నిలిపివేయాలని కోరగా, పీడీఎస్యూ ప్రతినిధులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. చెన్నూర్కు చెందిన తన్నీరు ప్రమీల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో తీసుకుని సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాబోయే వానాకాలం వ్యవసాయ సీజన్కు సంబంధించి రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్లో ని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లా డారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ఎల్–నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ముందస్తు సూచనలు అందించాలని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణ, మిశ్రమ పంటలు, స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించాలని, భూమిలో తగిన తేమ ఏర్పడిన తర్వాతే విత్తనాలు విత్తాలని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయిల్ పామ్, మొక్కజొన్న సాగును ప్రోత్సహించడంతో పాటు పంట అవశేషాలను తగలబెట్టే చర్యలను పూర్తిగా నిరోధించాలని ఆదేశించారు. పంట అవశేషాల దహనంతో నేల సారం తగ్గిపోవడంతో పాటు వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట అవశేషాలను తగులబెట్టే రైతులకు రూ.2,500 నుంచి రూ.15వేల వరకు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. జిల్లా లో ఏర్పాటు చేసిన 17 క్లస్టర్లలో రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించాలని, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. రాబోయే పది రోజుల పాటు వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ సెయిలింగ్ ఛాంపియన్ షిప్ లో బంగారు పతకం సాధించిన భిక్కనూరు విద్యార్థి

**ఉద్యమ కెరటం, ,భిక్కనూరు**




హైదరాబాద్లోని హుస్సేన్సాగర్లో జూన్ 1 నుంచి 6 వరకు నిర్వహించిన 17వ జాతీయ మాన్సూన్ రెగట్టా సెయిలింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని రిశ్విత బంగారు పతకం సాధించింది. కామారెడ్డి ఎంజేపీ బాలికల పాఠశాలలో చదువుతున్న రిశ్విత, బద్రీనాథ్తో కలిసి మిక్స్డ్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది.భిక్నూర్కు చెందిన శ్రీకాంత్ గౌడ్, పద్మ దంపతుల కుమార్తె అయిన రిశ్విత జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంతో కుటుంబ సభ్యులతో పాటు జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం విశేషమని పలువురు అభిప్రాయపడ్డారు.జాతీయ స్థాయిలో విజయం సాధించిన రిశ్వితను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. అలాగే ఎంజేపీ సొసైటీ కార్యదర్శి సైదులు, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.రిశ్విత సాధించిన విజయంపై పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు శ్రీకాంత్ గౌడ్, పద్మతో పాటు భిక్నూర్ గౌడ సంఘం నాయకులు, సభ్యులు కూడా ఆమెకు అభినందనలు తెలిపారు. రిశ్విత మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా లక్ష్మాపూర్ లో గ్రామసభ.

- **వర్షా కాలంలో ఆరోగ్యం, పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో**
- **సీజనల్ వ్యాధుల నివారణపై గ్రామస్థులకు అవగాహన : సర్పంచ్ నవీన్ గౌడ్.**
- **ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు వేదిక కావాలి : సెక్రటరీ శ్రీకాంత్.**

**ఉద్యమ కెరటం,,రామాయంపేట**

రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామసభ ను సోమవారం నిర్వహించారు. సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రామాయంపేట ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలు ఆరోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కూరగాయలు, పండ్ల తొక్కలు, మిగిలిన ఆహార పదార్థాలను తడి చెత్త డబ్బాలో, కాగితాలు, ప్లా స్టిక్ వస్తువులు, గాజు సీసాలు వంటి వాటిని పొడి చెత్త డబ్బాలో వేయాలని సూచించారు.




## ప్రోత్సాహక మ్యాచ్ మాత్రమే..

అఫ్గాన్‌పై సాధించిన భారీ విజయంతో భారత్‌కు ఒరిగేదేం లేదు. ఆల్‌టైమ్ రికార్డ్ విజయాన్ని అందుకున్నా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ స్థానం ఏ మాత్రం మారదు. ఎందుకంటే ఈ మ్యాచ్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27 సైకిల్‌లో భాగం కాదు. అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ప్రోత్సాహం అందించే ఉత్తిత్తి మ్యాచ్. దీంతో ఈ గెలుపుతో టీమిండియాకు ఉపయోగం లేకుండా పోయింది. డబ్ల్యూటీసీ 2025–27 పాయింట్స్ టేబుల్‌లో ప్రస్తుతం భారత్ 48.15 విన్నింగ్ పర్సంటేజ్‌తో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సైకిల్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 గెలిచి మరో నాలుగు ఓడింది. ఒక మ్యాచ్ డ్రా అయ్యింది. గతేడాది ఇంగ్లండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ సైకిల్‌ను ప్రారంభించిన భారత్.. ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2–2తో సమం చేసుకుంది. ఆ తర్వాత వెస్టిండీస్‌తో సొంతగడ్డపై 2 టెస్ట్‌ల సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేసింది. కానీ సొంతగడ్డపై సౌతాఫ్రికా చేతిలో 2–0తో క్లీన్ స్వీప్ అయ్యింది. ఈ ఘోర పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ భారత్ కంటే ముందు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## ఏడింటా గెలవాల్సిందే..

భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే ఇంకా 9 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రీలంకలో రెండు, న్యూజిలాండ్‌లో రెండు, సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల్లో తలపడాలి. ఫైనల్ రేసులో నిలవాలంటే 9 మ్యాచ్‌ల్లో కనీసం ఏడు గెలవాల్సిందే. న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా చివరిసారిగా 2009లో టెస్ట్ మ్యాచ్ గెలిచింది. అక్కడే జరిగే మ్యాచ్‌లు భారత జట్టుకు పెద్ద సవాల్‌గా మారనున్నాయి. ఈ 9 మ్యాచ్‌లకు సన్నాహకంగానే టీమిండియా అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడింది.

# టీమిండియా రికార్డు విజయం

## అఫ్గాన్‌ను 300 పరుగుల తేడాతో ఓడించిన గిల్ సేన

- రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే కుప్పకూలిన ప్రత్యర్థి జట్టు
- మానవ్ సుతార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్





**చండీగఢ్:** అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత జట్టు ఇన్నింగ్స్‌తో పాటు 300 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్థాన్‌ను మట్టికరిపించింది. టెస్టు క్రికెట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మూడో రోజు 113/5 స్కోరుతో ఆటను కొనసాగించిన అఫ్గానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకే ఆలౌటైంది. రహ్మత్ షా 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం అఫ్గాన్‌ను ఫాలోఆన్ ఆడించిన భారత్ బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రత్యర్థిని చిత్తు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో అఫ్గానిస్థాన్ 112 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్ 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, రహ్మనుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. గాయంతో బాధపడుతున్న షరాఫుద్దీన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాకపోవడంతో అఫ్గాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లు, కుల్‌దీప్ యాదవ్ 3 వికెట్లు తీసి అఫ్గాన్ బ్యాటింగ్‌ను కుదేలు చేశారు. మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్ తలో వికెట్ దక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో అరంగేట్ర స్పిన్నర్ మానవ్ సుతార్ 6 వికెట్లతో మెరిసి మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ 3 వికెట్లు సాధించి మంచి సహకారం అందించాడు. ఇక భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 564/8 వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 126 పరుగులతో శతకం సాధించగా, కేఎల్ రాహుల్ 100 పరుగులతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ అజేయంగా 52 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. మానవ్ సుతార్ 28, యశస్వి జైస్వాల్ 24, ధ్రువ్ జురెల్ 19 పరుగులు జోడించారు. బ్యాట్‌తోనూ, బంతితోనూ అద్భుత ప్రదర్శన చేసిన మానవ్ సుతార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మొత్తంగా అన్ని విభాగాల్లో ఆధిపత్యం



చెలాయించిన భారత్ అఫ్గానిస్థాన్‌పై రికార్డు స్థాయి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

### అతిపెద్ద ఇన్నింగ్స్ విజయం

టెస్టుల్లో భారత్‌కు ఇదే అతిపెద్ద ఇన్నింగ్స్ విజయం. 2018లో వెస్టిండీస్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఇన్నింగ్స్ 272 రన్స్‌తో గెలుపొందింది. ఇప్పటివరకు ఇదే అతిపెద్ద విజయంగా ఉండగా, తాజా ఈ మ్యాచ్ ఫలితం దాన్ని అధిగమించింది. మరోవైపు భారత్ గడ్డపై ఇది రెండో అతిపెద్ద టెస్ట్ విజయం. 1958లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై వెస్టిండీస్ ఇన్నింగ్స్ 336 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ రికార్డ్ ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. తాజా ఫలితంతో టెస్ట్‌ల్లో అతిపెద్ద విజయం సాధించిన రెండో ఆసియా టీమ్‌గా టీమిండియా నిలిచింది. ఈ జాబితాలో భారత్ కంటే పాకిస్థాన్ ముందువరుసలో ఉంది. 2002లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్తాన్ ఇన్నింగ్స్ 324 పరుగుల తేడాతో గెలుపొందింది.



## Business బిజినెస్

# స్టాక్ మార్కెట్‌కు భారీ షాక్

## సెన్సెక్స్ 719 పాయింట్లు, నిఫ్టీ 244 పాయింట్లు పతనం

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, పెరిగిన ముడిచమురు ధరల ప్రభావం
- ప్రపంచ మార్కెట్లలో బలహీన సంకేతాలతో మదుపర్లలో ఆందోళన



**ముంబై:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వారాంతపు ట్రేడింగ్‌లో భారీ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. పశ్చిమాసియాలో తాజా భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల, అమెరికాలో వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశాలపై నెలకొన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో కీలక సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు గణనీయ నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ గత ముగింపు 74,243.34 పాయింట్లతో పోలిస్తే 73,421.61 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. రోజంతా ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీ ఒక దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. మధ్యాహ్నం కొంతమేర కోలుకున్నప్పటికీ, చివరి గంటలో మళ్లీ విక్రయాల ఒత్తిడి పెరగడంతో 719.08 పాయింట్లు కోల్పోయి 73,524.26 వద్ద ముగిసింది. అదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 243.70 పాయింట్లు పతనమై 23,123 స్థాయికి చేరుకుంది. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.70 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ సూచీలోని షేర్లలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, ఇండిగో, రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రధానంగా నష్టపోగా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాల్లో నిలిచాయి.

### మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు

పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ ఆర్థిక మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పరస్పర దాడులు కొనసాగుతాయన్న భయంతో పెట్టుబడిదారులు రిస్క్ ఆస్తుల నుంచి దూరంగా ఉండటానికి మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రభావం ఆసియా మార్కెట్లపై స్పష్టంగా కనిపించగా, యూరప్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే ట్రేడయ్యాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం కూడా దేశీయ మార్కెట్‌ను దెబ్బతీసింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 96.95 డాలర్లకు చేరుకోవడంతో ఇంధన వ్యయాలు పెరిగే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధిక చమురు ధరలు ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే అవకాశం ఉండటంతో మదుపర్లు జాగ్రత్త వైఖరిని అవలంబించారు. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సుకు 4,290 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, సురక్షిత పెట్టుబడుల వైపు పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, వడ్డీ రేట్లపై ఆందోళనలు దేశీయ స్టాక్ మార్కెట్‌ను భారీ నష్టాల్లోకి నెట్టాయి.

# ఏఐ విప్లవం ప్రారంభమైంది



- ఎన్విడియా సీఈఓ హువాంగ్

**సియోకే:** కృత్రిమ మేధ (ఏఐ) రంగానికి సంబంధించిన టెక్నాలజీ షేర్లు ఇటీవలి కాలంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ, దీర్ఘకాలికంగా ఈ రంగం భవిష్యత్తు అత్యంత ఆశాజనకంగా ఉందని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెక్ స్టాక్స్‌లో కనిపిస్తున్న పతనాన్ని ప్రతికూల సంకేతంగా కాకుండా, పెట్టుబడిదారులకు లభించిన మంచి అవకాశంగా చూడాలని ఆయన సూచించారు. ఏఐ కంపెనీల విలువలపై మార్కెట్లో అనిశ్చితి పెరగడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత పెంచవచ్చన్న అంచనాలు టెక్నాలజీ రంగ షేర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఎన్విడియాతో పాటు పలు చిప్ తయారీ సంస్థల షేర్లు కూడా ఇటీవల అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణకొరియా పర్యటనలో ఉన్న హువాంగ్‌కు ఏఐ స్టాక్స్ పతనం గురించి ప్రశ్న ఎదురైంది. దానికి స్పందించిన ఆయన, కృత్రిమ మేధ రంగం అభివృద్ధి ప్రయాణం ఇప్పుడే ప్రారంభ దశలో ఉందని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్లో కనిపిస్తున్న ధరల తగ్గుదల కారణంగా పెట్టుబడిదారులు నాణ్యమైన కంపెనీల షేర్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం పొందుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ రంగం భవిష్యత్తుపై పెట్టుబడిదారులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచించారు.ఇంటర్నెట్ నేటి ప్రపంచంలో ప్రతి రంగానికి ఎంత కీలకమో, రాబోయే కాలంలో ఏఐ కూడా అంతే ప్రాధాన్యతను సంతరించుకుంటుందని హువాంగ్ పేర్కొన్నారు. పరిశ్రమలు, వ్యాపారాలు, విద్య, ఆరోగ్యం సహా అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఏఐ సేవల విస్తరణకు భారీ స్థాయిలో డేటా సెంటర్లు, అధిక సామర్థ్యమున్న చిప్‌లు అవసరమవుతాయని ఆయన తెలిపారు.

ఉద్యమ కెరటం
మంగళవారం 9 జూన్ 2026


# జూలైలో 'జార్జ్ క్రిష్'

## శర్వానంద్‌కు జోడీగా అనంతిక?





హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రూపొందనున్న 'జార్జ్ క్రిష్' చిత్రం త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ సినిమాకు సంబంధించిన తొలి షెడ్యూల్ జూలై మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమాచారం ప్రకారం, తొలి షెడ్యూల్‌లో కీలకమైన ఓపెనింగ్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అనంతరం ఆగస్టులో నిర్వహించే రెండో షెడ్యూల్‌లో హీరో, హీరోయిన్‌లపై ప్రేమకథకు సంబంధించిన సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా 'మ్యాడ్', '8 వసంతాలు' చిత్రాలతో గుర్తింపు పొందిన అనంతిక సనీల్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.ఇక దర్శకుడు శ్రీను వైట్లకు ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారింది. ఇటీవల గోపీచంద్ హీరోగా తెరకెక్కించిన 'విశ్వం' చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోవడంతో, ఈసారి బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.'జార్జ్ క్రిష్' కథలో చిన్న వయసులో ఆవేశంతో చేసిన ఒక నిర్ణయం హీరో జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే అంశాన్ని వినోదాత్మకంగా, భావోద్వేగాలతో మేళవించి చూపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# జాన్వీని టార్గెట్ చేయొద్దు

'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోలింగ్ నేపథ్యంలో ప్రముఖ నటుడు జగపతిబాబు స్పందించారు. ఈ చిత్రంలో అప్పల సూరి పాత్రలో నటించిన ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కళాకారులను వ్యక్తిగతంగా విమర్శించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. "రూ.300 కోట్లు ఖర్చు చేసి సినిమా తీసినా, రూ.300 పెట్టి చూసే ప్రేక్షకుల చేతుల్లోనే సినిమా భవిష్యత్తు ఉంటుంది. ప్రేక్షకుల అభిప్రాయాన్ని గౌరవించాలి. అయితే ఆర్టిస్టులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మంచిది కాదు. జాన్వీ కపూర్ దర్శకుడు చెప్పిన విధంగానే తన పాత్రను పోషించింది. కొన్నిసార్లు కొన్ని పాత్రలు లేదా సన్నివేశాలు ప్రేక్షకులకు ఆశించిన స్థాయిలో నచ్చకపోవచ్చు. అందరి అభిరుచులు ఒకేలా ఉండవు. ఈ విషయంలో నేను జాన్వీకి అండగా ఉంటాను. ట్రోలింగ్ ద్వారా ఆమెను మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు" అని జగపతిబాబు అన్నారు. ఇక 'పెద్ది' చిత్రంలో తన పాత్రకు సంబంధించి కూడా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా విడుదల అనంతరం ఓ ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, "ఇంత గొప్ప పాత్ర పోషించినా ఎందుకు సరైన గుర్తింపు రావడం లేదు? ఇదే పాత్రను ఇతర భాషకు చెందిన నటుడు చేసి ఉంటే మరింతగా "ఏ పరిశ్రమలోనైనా ఇతర భాషల నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను కన్నడ చిత్రాల్లో నటించినప్పుడు అక్కడ ఎంతో ఆదరణ లభించింది. 'పెద్ది' విడుదల తర్వాత దర్శకుడు బుచ్చిబాబును కూడా నేను ఇదే విషయంపై ప్రశ్నించాను. షూటింగ్ సమయంలో ప్రతి సన్నివేశానికి ప్రశంసలు లభించాయి. కానీ విడుదల తర్వాత నా పాత్ర గురించి పెద్దగా చర్చ జరగకపోవడం ఆశ్చర్యంగా అనిపించింది. ఈ సినిమా కోసం నేను ఎంతో కష్టపడ్డాను. అందుకే నా పాత్రకు తగిన గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను" అని జగపతిబాబు పేర్కొన్నారు. 'పెద్ది' చిత్రానికి ఇంకా మరింత ఆదరణ లభించాల్సి ఉందని, ఆ నమ్మకం తనకు ఉందన్నారు.





# మండోదరిగా కాజల్

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ పౌరాణిక గాథలో స్టార్ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తుండగా, తాజాగా నటి కాజల్ అగర్వాల్ తన పాత్రపై స్పందించడం ఆసక్తిని మరింత పెంచింది.ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో, సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు కన్నడ స్టార్ హీరో యశ్ రావణుడి పాత్రలో కనిపించనుండగా, ఆయన సతీమణి మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషిస్తున్నట్లు ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా ఓ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న కాజల్, ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు.'రామాయణ' వంటి భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడం తన కెరీర్‌లోనే ప్రత్యేకమైన అనుభవమని కాజల్ పేర్కొన్నారు. ఈ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేలా సినిమా రూపొందుతోందని తెలిపారు.

# వరుణ్ తేజ్ మూవీపై కొత్త ప్రచారం



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న వినోదాత్మక చిత్రం 'కొరియన్ కనకరాజు'పై సినీ అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రచార గీతాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా, తాజాగా ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. సినీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం ప్రకారం, 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని 2026 ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అంతేకాకుండా, జూన్ మూడో వారంలో సినిమా నుంచి ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో అభిమానులు తదుపరి అప్‌డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన యువ నటి రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సంగీత దర్శకుడు ఎస్. థమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. సినిమాలో వరుణ్ తేజ్ 'కనకరాజు' అనే విభిన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన కొరియన్ భాషలో "నేను తిరిగొచ్చేశా" అని చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో కథలో కొరియన్ నేపథ్యం ఏమిటి? 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ వెనుక అసలు కథ ఏమిటి? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. కథలో కొరియన్ అంశాలు కీలకంగా ఉంటాయని, వాటిని వినోదాత్మకంగా మలిచారని చిత్రబృందం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఎంత మేరకు అలరిస్తుందో చూడాలి.

# షూటింగ్ ముగిసిన వెంటనే ఇంటికే



ప్రముఖ నటుడు మాధవన్ తన వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల తన వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న ఆయన, కుటుంబ బంధాలు, భార్యతో అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జూన్ 6న వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న సందర్భంగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాధవన్ మాట్లాడుతూ, తాను ఎప్పుడూ తన భార్య సరితకు నిజాయితీగా ఉన్నానని తెలిపారు. సినీ పరిశ్రమలో ఎంతోమంది అందమైన నటీమణులతో కలిసి పనిచేసినా, కుటుంబం విషయం లో తనకు ఎలాంటి సందిగ్ధత లేదని చెప్పారు. "కుటుంబ సభ్యులతో ఆనందంగా ఎలా జీవించాలో మా పూర్వీకుల నుంచే నేర్చుకున్నాను. భార్య పట్ల విధేయతతో ఉండటం మా కుటుంబ సంస్కృతిలో భాగం. నేను గ్లామర్ ప్రపంచంలో పనిచేస్తున్నా, షూటింగ్ పూర్తయ్యాక ఇంటికి వెళ్లి నా భార్యతో సమయం గడపడం నాకు ఎంతో ప్రశాంతతను ఇస్తుంది. నేను భార్యకు భయపడే సాధారణ మధ్యతరగతి వ్యక్తినే" అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ఇంట్లో ఆర్థిక వ్యవహారాలన్నీ తన భార్య సరితే చూసుకుంటుందని మాధవన్ వెల్లడించారు. తన ఫోన్ నిర్వహణ నుంచి బ్యాంక్ లావాదేవీల వరకు అనేక విషయాల్లో ఆమె కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. తన కెరీర్ ప్రారంభ దశలో హీరోగా గుర్తింపు పొందుతున్న సమయంలో, పెళ్లైన విషయాన్ని రహస్యంగా ఉంచాలని కొందరు సూచించారని మాధవన్ గుర్తు చేసుకున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**